క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నల్లజర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 11న మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సింహాద్రి తెలిపారు. వివిధ శాఖల అధికారులంతా తమ ప్రగతి నివేదికలను తీసుకొని సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో కరపత్రాలు పంచుతున్న అధికారులు

చాగల్లు: మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం చాగల్లు, ధారవరం, బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, ఊనగట్ల, నెలటూరు, మల్లవరం పంచాయతీల్లో ప్రతి ఇంటికీ కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్టు ఈవోపీఆర్డీ ఆర్.శ్రావణ్ కుమార్ తెలిపారు. తడి – పొడి చెత్త సేకరణ విధానం, తడి-చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారీ, వర్మీ కంపోస్టు వల్ల కలిగే ఉపయోగాలు, గ్రామ పంచాయతీ క్లాత్ మిత్రలకు చెత్త అందజేసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అన్ని ఫీడర్లు, కొత్తలైన్ల నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా ఈనెల12 నుంచి 14వ తేదీ వరకు వీరవల్లి, సంజీవపురం, నబీపేట ఫీడర్లలో వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణం అప్పారావు తెలిపారు.ఈ ఫీడర్లలో త్రీఫేజ్ కరెంట్ సరఫరా తెల్లవారుజామున 4 నుంచి 9 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు.

నిందితులకు శిక్షపై కేవీపీఎస్ హర్షం

నిడదవోలు: 2018లో నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన దళిత వర్గానికి చెందిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు సోమవారం తీర్పు వెల్లడించి నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయడంపై నిడదవోలు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో సంబంధం ఉన్న 8 మందిలో ఏ 1 మారుతీ రావు ఆత్మహత్య చేసుకున్నారు. ఏ 2గా ఉన్న సుభాష్ శర్మకు ఉరిశిక్ష, మిగిలిన ఆరుగురు నిందితులకు కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఈ తీర్పు కుల అహంకార ఉన్మాదులకు హెచ్చరిక లాంటిదని రాంబాబు అన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థానం

చాగల్లు: విద్యార్థులు వారి అభిరుచికి అనుగుణంగా కష్టపడి చదివితే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని ఎస్సై కె.నరేంద్ర అన్నారు. బ్రాహ్మణగూడెంలో సోఫియా ట్యూషన్ సెంటర్‌లో పదవ తరగతి విద్యార్థులతో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థినులు విద్యతో మాత్రమే సమాజంలో గౌరవాన్ని పొందగలరని అన్నారు. నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ ఎమ్. రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడుతూ కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చెయ్యాలని అన్నారు. ఉపాధ్యాయులు మహేష్, డి గోవర్ధన్, జి.శ్రీను, ఎల్లే శ్రీనివాస్, కప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలి

నిడదవోలు: పట్టణ పరిధిలోని తీరుగూడెంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్యయాత్రల్లో భాగంగా సోమవారం సీపీఎం బృందం టిడ్కో గృహాలను పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 1,200 మంది పేదలకు ఇళ్లు నిర్మించిందన్నారు. కొంత డబ్బును ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి వసూలు చేసిందన్నారు. అప్పటి నుంచి అప్పులు చేసిన పేదలు వడ్డీలు చెల్లిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం గృహాలను అప్పచెప్పకుండానే బ్యాంకర్లు వాయిదాలు వసూలు చేస్తున్నారని రాంబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఇంతవరకు లబ్ధిదారులకు ఇళ్లు అప్పచెప్పలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తామని రాంబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. సుందరబాబు, గుమ్మాపు డానియల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై పీ-4 సర్వే పిడుగు

- 27 రకాల ప్రశ్నలతో కుటుంబ సర్వే
- ఇంటిలోని విలువైన వస్తువుల వివరాల నమోదు
- సంక్షేమ పథకాలు తొలగిస్తారేమోనని లబ్ధిదారుల్లో ఆందోళన
- సచివాలయ ఉద్యోగులపై పని భారం



నిడదవోలు మండలంలో పీ-4 సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది



సమిశ్రగూడెంలో పని ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న మండల పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

నిడదవోలు రూరల్: కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అంటూ గత ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ మీ ఇంటికి ఇన్ని పథకాలు వస్తాయి.. ఇంత మేలు జరుగుతుందంటూ నమ్మించారు. కూటమి అధికారంలోకి వస్తే మీ జీవితాలు బాగుపడతాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా వీటి అమలుకు నోచుకోలేదు. చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా సన్నాయి నొక్కులు నొకుతున్నారు. తాజాగా పీ–4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసేందుకు శ్రీకారం చుట్టారు.

కొనసాగుతున్న సర్వే

ఫోన్, టీవీ, ఏసీ ఇతర గృహోపకరణాలు, బైక్‌లున్నాయా? ఇళ్ల స్వరూపం, రేకులా, స్లాబా, బ్యాంక్ అకౌంట్ ఇలా 27 రకాల ప్రశ్నల్ని సంధించి సమాధానాలను సేకరించి సంబంధిత వివరాలను సచివాలయ సిబ్బంది నింపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి ప్రక్రియను ముగిస్తున్నారు. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, నిడదవోలు మండలం, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలోని 73,046 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో దారిద్ర్యరేఖకు దిగువన కుటుంబాల్లో అప్పోసప్పో చేసి నెలవారీ వాయిదాల్లో లేక ఎవరైనా కానుకగా ఇస్తే వారి ఇళ్లల్లో ఏసీలను ఎక్కువ మంది ఏర్పాటు చేసుకుంటారు. ఏసీ ఉందని తెలిస్తే చాలు సచివాలయ సిబ్బంది ఆ వివరాలను ప్రభుత్వ రికార్డుల్లోకి నమోదు చేస్తున్నారు. దీంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది. వివిధ గ్రామాల్లో ప్రస్తుతం ఈ సర్వే చడీచప్పుడూ లేకుండా జరుగుతోంది. ఒక్కొక్క సచివాలయ ఉద్యోగి రోజుకు తమ పరిధిలోని 200 కుటుంబాల్లో సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వారిలో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో పంచాయతీ కార్యర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్ హోల్డు జియో ట్యాగింగ్, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, 6 ఏళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ రెసిడెన్స్ సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నులు వసూళ్లతో పాటు ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణ అడుగుతుండటంతో సచివాలయ సిబ్బంది సతమతమవుతున్నారు.

నిరాకరించినా.. నమోదు

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్‌ఫోన్లు, బైక్‌లు ఇలాంటి ప్రశ్నలు ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది. పీ–4 సర్వేను నిబంధనలను అనుగుణంగా నిర్వహించాలని, దీని ద్వారా సరైన పౌర సమాచారం ప్రభుత్వానికి అందుతుందని అధికారులు అంటున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు కిందిస్థాయి అధికారులకు చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలుచేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు అంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.

నియోజకవర్గంలో పీ-4 సర్వే చేసే కుటుంబాల వివరాలు

మండలం	కుటుంబాలు
నిడదవోలు	21,294
నిడదవోలు పట్టణం	7,893
పెరవలి	21,316
ఉండ్రాజవరం	22,543

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ముస్తఫా



ఎస్‌కే ముస్తఫా



సున్నం వరప్రసాద్

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా దేవరపల్లి మండలం యాదవోలుకు చెందిన షేక్ ముస్తఫా, నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా యాదవోలు సర్పంచ్ సున్నం వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్టు వారు తెలిపారు. ఐదేళ్లుగా మండల మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా, యాదవోలు జెడ్పీ హైస్కూలు పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా షేక్ ముస్తఫా పనిచేశారు. మండలాల్లో మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేసి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరలా అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానని ముస్తఫా అన్నారు. గతంలో పంచాయతీరాజ్ విభాగం మండల అధ్యక్షుడిగా, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా సున్నం వరప్రసాద్ పనిచేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత, పార్టీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారానికి వారానికి రెండు సమావేశాలు



కొవ్వూరులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: మీకోసం అర్జీదారుల సమస్యల పరిష్కారానికి డివిజన్ స్థాయిలో అధికారులతో వారానికి రెండు సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆర్డీవో రాణి సుస్మిత ప్రకటించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)– మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ ద్వారా ఆరు అర్జీలు అందాయన్నారు. ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాడిపూడికి చెందిన రైతు కోడూరి జానకి రామారావు మూడేళ్ల క్రితం గ్రామంలో ఒక వ్యక్తి నుంచి భూమిని కొనుగోలు చేశాడు. ఇప్పుడు ఆ భూమి తనదంటూ విక్రయించిన వ్యక్తే అడ్డుకుంటున్నాడని రామారావు ఫిర్యాదు చేశారు. పశివేదలకు చెందిన కరుటూరి సత్యనారాయణ తన కుమార్తెకు గతంలో ఇచ్చిన మూడెకరాల పొలంలో తన పోషణ నిమిత్తం అర ఎకరం భూమి తిరిగి వెనక్కి ఇప్పించాలని కోరారు. నందమూరుకు చెందిన రైతు గన్నమని రామారావు తన స్థలాన్ని మండల సర్వేయర్ ద్వారా కొలిపించి సరిహద్దులు నిర్ధారించాలని కోరారు. తోగుమ్మికి చెందిన ఉప్పులూరి రాజేంద్రకుమార్ వాడపల్లిలో వేద పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న భారీ వృక్షం వల్ల తన పొలంలో పంట పాడవుతోందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేములూరుకు చెందిన మంగరాయి వెంకటరమణ అనే మహిళ తనకు పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. హుకుంపేటకి చెందిన బర్ల రాజశేఖర్ మాజీ సైనికుల భూమిని సర్వే చేయించి ఇవ్వాలని కోరారు. ఇన్‌చార్జ్ ఏవో రవి విక్రమ్, వివిధ శాఖలకు చెందిన డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మదనగోపాలస్వామి కల్యాణం



తాళ్లపూడిలో కల్యాణం సందర్భంగా పుష్పాలంకరణలో రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి

తాళ్లపూడి: దేవతా మూర్తుల కల్యాణాలను ప్రత్యక్షంగా తిలకించడం ద్వారా శుభ ఫలితాలు కలుగుతాయని పురాణ ఉపన్యాసకులు పరసరాధాకృష్ణ పేర్కొన్నారు. తాళ్లపూడిలో వివాహాల దేవుడు, సంతాన మదన గోపాలుడిగా ప్రసిద్ధి చెందిన రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పరస వంశీకులు వంశపారంపర్యంగా ఈ కల్యాణం నిర్వహిస్తున్నారు. పరస వంశస్తులతో పాటు పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మదనగోపాలస్వామిని, ఆలయ ప్రాంగణంలోని మండపాన్నిపుష్పాలతో ప్రత్యేకంగా సుందరంగా అలంకరించారు. మంగళవారం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి జనార్దనరావు, అప్పన రాజా, కంకిపాటి సాయి, సొలస ఉమా పాల్గొన్నారు.అదే విధంగా ఏకాదశి సందర్భంగా వేగేశ్వరపురంలోని ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



దేవరపల్లిలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



యర్నగూడెంలోని పద్మావతీ దేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం

దేవరపల్లి: పాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. స్థానికులతోపాటు సమీప గ్రామాల నుంచి భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం

దేవరపల్లి: యర్నగూడెంలో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు సోమవారం అభిషేక కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పాల్గుణ శుద్ధ ఏకాదశి మహా పర్వదినం పురష్కరించుకుని ఉత్సవ మూర్తు లకు అభిషేక కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం తెలిపారు. భక్తులు పాల్గొని అభిషేకాన్ని తిలకించారు.

అంగన్‌వాడీలను మోసగించిన కూటమి సర్కార్

కొవ్వూరు: తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ, అధికారంలోకి వచ్చిన పది నెలలు కావస్తున్నా ఇంత వరకు వేతనాలు పెంచకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన కొవ్వూరులో విలేకర్లతో మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని విజయవాడలో నిర్వహించే శాంతియుత ధర్నాకి బయలదేరిన అంగన్‌వాడీలను మార్గమధ్యలో పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గతంలో అంగన్‌వాడీలు 42 రోజులు పాటు సమ్మె చేసిన సమయంలో కూటమి నాయకులంతా తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని చెప్పి నమ్మించి మోసగించారని ఆరోపించారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోగా చనిపోయిన వారికి మట్టి ఖర్చులు నిమిత్తం రూ.20వేలు అందిస్తామని చెప్పి రూ.15వేలు ఇచ్చేందుకు జీవో జారీ చేయడం సిగ్గు చేటన్నారు. సుప్రీం కోర్టు చెప్పిన విధంగా అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించి చేతులు దులుపుకుంటే ఒప్పుకునేది లేదని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు, ఇతర ఖర్చులు నెలలు తరబడి బకాయిలు పేరుకుపోయాయని, రూ.11వేలు వేతనం వాటికే సరిపోతుందన్నారు. తక్షణమే అంగన్‌వాడీలకు వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మొబైల్ యాప్ పని భారాన్ని తగ్గించాలన్నారు. సుప్రీం కోర్టు సూచించిన గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయాలని, మినిట్స్‌లో అంగీకరించిన అంశాలన్నింటికీ జీవోలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే ఐదు కుటుంబాల్లో విషాదం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు



తాడిపూడిలో మృతుల కుటుంబాలను ఓదార్చి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా

తాళ్లపూడి: ప్రభుత్వ వైఫల్యం వల్లే పేద కుటుంబాలు తమకు అండగా ఉండాల్సి కొడుకులను కోల్పోయారని తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నారు. తాడిపూడిలో మహాశివరాత్రి రోజు గోదావరిలో స్నానానికి వెళ్లి మృతి చెందిన పడాల దుర్గాప్రసాద్, పడాల దేవదత్త సాయి, అనిశెట్టి పవన్ గణేష్, గర్రే ఆకాష్, తిరుమలశెట్టి పవన్ కుమార్ కుటుంబాలను సోమవారం తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కొవ్వూరు నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ తలారి వెంకట్రావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో వారి చేతులు మీదుగా వైఎస్సార్‌సీపీ తరపున ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు చొప్పున రూ.2.50 లక్షలు ఆర్థిక సాయం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు జరిగిన లోటును ఎవరూ తీర్చలేనిదని అన్నారు. తమ వంతుగా వైఎస్సార్‌సీపీ తరపున రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్టు చెల్లుబోయిన వేణు, తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా అన్నారు. ఇసుక ర్యాంపుల వద్ద గోదావరి పరివాహక ప్రాంతంలో మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కేవలం రూ.5 వేలు ఇచ్చిందని ఇంకా సాయం అందించాల్సి అవసరం ఉందన్నారు. ఇసుక ర్యాంపుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఐదు కుటుంబాల్లో విషాదం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, తాడిపూడి సర్పంచ్ నామా శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, నాయకులు పోశిన శ్రీకృష్ణదేవరాయులు, యాళ్ల బాబురావు, సుంక వెంకట రెడ్డి, గండి రాంబాబు, నామా ప్రకాశం, సుంకర సత్యనారాయణ, మండిగ గిరి, తిగిరిపల్లి వెంకట్రావు, సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘యువత పోరు’కు తరలిరండి


- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల్ పిలుపు
- యువత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల్, నాయకులు

నిడదవోలు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 12న ‘యువత పోరు’ పేరిట కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో సోమవారం యువత పోరుబాట పేరిట వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. వెయ్యి కోట్లు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. దీనివల్ల పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని కళాశాలలో ఫీజు కట్టకపోతే హాల్ టికెట్లు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. అప్పుచేసి ఫీజులు కడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు బకాయిలుంటే విద్యార్థులను పరీక్షలకు అనుమతించడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తల్లుల బ్యాంక్ ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో మాత్రం కల్లబొల్లి మాటలు చెప్పి విద్యార్థులను, యువతను పూర్తిగా మోసం చేసిందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. ఒక్కో నిరుద్యోగ యువతకు ఇప్పటి వరకు రూ.30 వేలు బాకీ పడ్డారన్నారు. విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదలయ్యే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. జిల్లాలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, యువత పోరుబాటకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదల చేసేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమనేని రమేష్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలగాడ బాలరాజు, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, పడాల శిరీష, అలమూరు భారతి, దాకే అనిల్‌కుమార్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్, యోగాసనాల ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



మార్షల్ ఆర్ట్స్, యోగాసనాల్లో వరల్డ్ రికార్డు ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

దేవరపల్లి: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో బాలుర జెడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన వరల్డ్ రికార్డు నమోదు కోసం మార్షల్ ఆర్ట్స్, యోగాసనాల ప్రదర్శనలో గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, దూబచర్లకు చెందిన 78 మంది కరాటే విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. 22 యోగాసనాలు, మార్షల్ ఆర్ట్స్(నాంచక్) కలిపి ప్రదర్శించి ప్రపంచంలో మొట్టమొదటి సారిగా 250 మంది కరాటే విద్యార్థులు పాల్గొని వరల్డ్ రికార్డు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. కమిటీ చైర్మన్ కేతా శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ ప్రదర్శన నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ఉండ్రాజవరం: హాస్టల్ పేరు నిలబెట్టేందుకు విద్యార్థులు బాగా చదివి, మంచి మార్కులు సాధించాలని ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది పి.సురేష్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆల్ ఇండియా అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం ఎస్సీ హాస్టల్లో వద్ద 10వ తరగతి విద్యార్థులకు సోమవారం విద్యా సామగ్రి అందజేశారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సై గుబ్బల శ్రీనివాసు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భమిడి శాస్త్రి, సుధీర్, హాస్టల్ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.